'రాచకొండ'ను డ్రగ్ ఫ్రీ సిటీ చేద్దాం

- టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- యాంటీ డ్రగ్స్‌పై బిట్స్ పిలానీలో అవగాహన సదస్సు

జవహర్‌నగర్: డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దని టీఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి విద్యార్థులకు సూచించారు. బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో శరీరం నిర్వీర్యం అవుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డ్రగ్స్‌పై పోరును సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నగరంలోని అన్ని పబ్బులపై తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 12 పీడీ కేసులు నమోదు చేసి దాదాపు రూ.5 కోట్ల విలువైన డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనకు రాచకొండను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చుదామని పేర్కొన్నారు. అనంతరం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చివరిగా మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్‌ను టీ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్ కౌన్సిలేట్ అధికారి ఎరిన్ ఫిషర్, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్, ఎస్బీ డీసీపీ కరుణాకర్, అడ్మిన్ డీసీపీ ఇందిర, మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, అడ్మిన్ ఏడీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎండ్ నౌ ఫౌండర్ అనిల్ రాచమల్ల, ఆర్కే ఎస్సీ కోశాధికారి గగన్‌దీప్ కోహ్లి, జవహర్‌నగర్ సీఐ సీతారాం, రాములు, డీఐ శ్రీనివాస్, ఎస్సైలు అనిల్‌యాదవ్, అనిల్‌కుమార్, వేణు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సందీప్ శాండిల్య, సీపీలు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి

పురపాలికలకు మహర్దశ

ఓఆర్ఆర్ లోపలి పంచాయతీల్లోనూ అభివృద్ధి

- 13 యోజకవర్గాల్లో 45,500 ఇందిరమ్మ ఇళ్లకు నిధులు
- అభయహస్తం, సంక్షేమం, విద్యా, వైద్య రంగాలకు నిధుల పెంపు
- పంట సాగు చేయని భూములకు రైతుబంధు రద్దుకు యోచన..!
- బడ్జెట్ నిధుల కేటాయింపుపై నగర శివారు ప్రజల్లో ఆశలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: బడ్జెట్‌లో వివిధ రంగాలకు నిధుల కేటాయింపులు నగర శివారు ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అభయ హస్తం పథకంలోని ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా ఆరు గ్యారంటీలకు రూ.53,196 కోట్ల కేటాంపులను పరిశీలిస్తే.. నగర శివారుల్లో అర్హులైన వారందరిలో ఆశలు చిగురిస్తున్నాయి. మేడ్చల్ జిల్లాలో అభయ హస్తం పథకానికి సంబంధించిన దరఖాస్తులు 7.24 లక్షలు రాగా, ఇందులో 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తులు 2.29 లక్షలు ఉన్నాయి. జిల్లాలో 14.73 లక్షల గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, ఆహార భద్రతా కార్డులు మాత్రం 5.23 లక్షలు ఉన్నాయి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను పరిశీలిస్తే.. వీరందరికీ గృహలక్ష్మీ కింద ఉచిత విద్యుత్తు పంపిణీ పథకం వర్తించే అవకాశముందని సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి కూడా దాదాపు ఐదు లక్షల కుటుంబాలు రూ.500లకే గ్యాస్ కనెక్షన్ లబ్ధి పొందగలరని వెల్లడిస్తున్నారు.

శివారుల్లో 45,500 ఇళ్లకు మోక్షం..

సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందజేసే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించగా, శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలలో సొంత స్థలమున్న 45,500 మంది నిరుపేదలు ఇళ్లు కట్టుకోవడానికి అవకాశం లభించినట్లయ్యింది. ఇందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 17,500 మంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుంది.

నగరానికి సమాంతరంగా శివారుల్లో అభివృద్ధి

మహానగరానికి సమాంతరంగా శివారుల్లోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల శివారు పురపాలికలు, పంచాయతీలతో పాటు ఔటర్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని అర్బన్ ఏరియా గుర్తించి అభివృద్ధి చేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతో నగర శివారుల్లో 29 పురపాలికలతోపాటు 619 గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రెండు జిల్లాలోని పురపాలక సంఘాలు, సెమీ అర్బన్, పట్టణాలుగా మారిన జీపీల్లో కనీస సమస్యలకు శాశ్వత పరిష్కారం, ఏకీకృత విధానంతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధి వంటి విషయాలపై సమగ్ర ప్రాజెక్టు రూపకల్పన జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రెండు జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత కలెక్టర్లకు సూచించినట్లు తెలుస్తోంది.



పంటసాగు భూములకే రైతుబంధు

బడ్జెట్ ప్రతిపాదనల సందర్భంగా రైతుబంధు పథకంపై ప్రభుత్వం ప్రస్తావించిన తీరును పరిశీలిస్తే.. పంట సాగు చేయని వ్యవసాయ భూములకు పంట పెట్టుబడి సాయం రైతు బంధు రద్దు చేసే యోచన ఉన్నట్లు తెలుస్తోంది. భూస్వామ్య రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు కూడా రైతుబంధు సాయం అందుతున్నట్లు భావిస్తోంది. అందులో భాగంగా పంటసాగు భూములపై సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం జిల్లాల అధికార యంత్రాంగాన్ని కోరినట్లు సమాచారం. మేడ్చల్ జిల్లాలోని 48,072 మంది రైతులకు 79,843 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. పెట్టుబడి సాయం కింద 6 నెలలకు ఒకసారి 35,596 మంది రైతులకు రూ.33.10 కోట్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో వాస్తవంగా 25,480 ఎకరాల్లో మాత్రమే పంట సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

సంక్షేమ రంగం, గ్రామీణ అభివృద్ధికి కూడా..

సంక్షేమ రంగాలతో పాటు గ్రామీణ అభివృద్ధికి గతం కంటే ఎక్కువ నిధులను బడ్జెట్‌లో కేటాయించారు. గ్రామీణ అభివృద్ధికి గతంలో రూ.31 వేల కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్లో రూ.40 వేల కోట్లు కేటాయించటం.. గ్రామాల అభివృద్ధికి సూచికగా పేర్కొంటున్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ రంగాలకు గతంలో రూ.33 వేల కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.44 వేల కోట్లు కేటాయించారు. దీంతో సంక్షేమ రంగాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

తెలుగు జాతికి పీవీ గర్వకారణం


గౌడవెల్లిలో పీవీ విగ్రహం వద్ద నేతల సంబరాలు

మేడ్చల్: ప్రపంచమంతా ఉన్న తెలుగు జాతికి దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు గర్వకారణమని మేడ్చల్ మండల వివిధ పార్టీల నాయకులు అన్నారు. పీవీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన సందర్భంగా నాయకులు గౌడవెల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచుకున్నారు. బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, భగవాన్‌దాస్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం వెలికితీసేందుకు హ్యాకథాన్



ఘట్‌కేసర్: డేటా డైనమో హ్యాకథాన్ సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీస్తుందని సీనియర్ అకాడమీ ప్రోగ్రామ్ మేనేజర్ పంకజ్ ముతే అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డేటా డైనమో 24 గంటల హ్యాకథాన్ శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా డైనమో హ్యాకథాన్ డేటా శక్తిని వినియోగించుకోవడానికి, సృజనాత్మకతను ప్రదర్శించడానికి వేదిక అవుతుందన్నారు. హ్యాకథాన్‌లో 250 విద్యార్థులు పాల్గొనగా 78 బృందాలుగా విభజించారు. ప్రతిభ కనబర్చిన నాలుగు జట్లను ప్రశంసించారు. డేటా సైన్స్ విభాగాధిపతి శ్రీదేవి, విజయేందర్‌రెడ్డి, బుసిరెడ్డి, డీన్ విష్ణుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో మార్కెట్ యార్డును అందుబాటులోకి తెస్తాం


నాగారంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్పానగర్‌లో రూ.4.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్, వెజ్–నాన్‌వెజ్ కాంప్లెక్స్ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తిచేసి మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, డీఈఈ సుదర్శనం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


సీసీ పనులు పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 10వ వార్డు కరీంగూడ రోడ్డులో, వార్డులోని పలు కాలనీల్లో శనివారం సీసీ రోడ్డు మరమ్మతులు చేయించారు. చైర్ పర్సన్ పావనీజంగయ్య మాట్లాడుతూ వార్డు ప్రజలకు మెరుగైన రోడ్లు అందించాలని మరమ్మతులు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సంగీత, నాయకులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డు బొక్కొనిగూడలో ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థానిక కౌన్సిలర్ సంగీత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజల విన్నపం మేరకు గ్రామంలో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు జంగారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనంగా మార్చే ప్రాజెక్ట్ గగన్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన త్రీవీలర్ తయారీ సంస్థ జీరో–21 రెన్యూవబుల్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రై.లిమిటెడ్.. సాధారణ ఇంధన ఆధారిత ఆటోలను ఎలక్ట్రికల్ ఆటోలుగా మార్చుకునేందుకు రెట్రోఫిట్మెంట్ అనే ప్రక్రియను నగరంలో అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ పర్యావరణహిత కార్యక్రమం 'ప్రాజెక్ట్ గగన్' పేరిట లక్ష ఆటోలను ఇలా మార్చడం లక్ష్యమని, తమ సాంకేతిక ప్రక్రియను ఉపయోగించి ఏదైనా ఐసిఇ ఇంజన్ ద్వారా నడిచే త్రీవీలర్‌ను కేవలం 4 గంటలలోపు ఎలక్ట్రిక్ వాహనంగా మార్చవచ్చన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

గౌతంనగర్: గోపాల్‌నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరుతూ శనివారం కాలనీవాసులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గోపాల్‌నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, మల్లేష్ యాదవ్, కాలనీవాసులు డీఎస్ఎన్ రాజు, మూర్తి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలి


పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: పీఎం విశ్వకర్మ యోజనపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లో పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని శనివారం ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంప్రదాయ చేతి వృత్తిదారులు, హస్తకళాకారులకు శిక్షణ, నైపుణ్యం, ఆర్థిక సహకారం అందించి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకం అమలు చేస్తుందన్నారు. 18 కేటగిరీకి చెందిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావేరి, కార్యదర్శి సునీత, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అజయ్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ వైస్ ఎంపీపీ బెస్త వెంకటేష్ తదితరులు

పీఎం విశ్వకర్మ పథకంపై అవగహన

కీసర: గ్రామీణ కళాకారులు చేతివృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్ అన్నారు. కీసరలో ప్రత్యేక అధికారి నందకిషోర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామసభలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగహన కల్పించారు. చేతివృత్తుల వారికి శిక్షణ అందించే ఆర్థిక సహాయం వివరాలు తెలిపారు. పీఏసీఎస్ మండల చైర్మన్ ఆర్.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, టి.నారాయణశర్మ, మాజీ ఎంపీటీసీ బి.రమేష్‌గుప్తా, పంచాయతీ కార్యదర్శి గంగన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు అయోధ్యకు తరలివెళ్లారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైల్‌లో అయోధ్యకు వెళ్లారు. వార్డుల, గ్రామాలవారిగా నాయకులు స్థానిక ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం తరలివెళ్లారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, ప్రేందాస్ తదితరులు నేతృత్వం వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నుజ్జునుజ్జయిన కారులో ఉపేందర్ మృతదేహం



ఘట్‌కేసర్: ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నడిపిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించిన ఘటన జరిగింది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాచారం ప్రాంతానికి చెందిన మోర ఉపేందర్(37) కుటుంబ సభ్యులతో కలిసి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఘట్‌కేసర్ వైపు నుంచి బాచారం వైపు కారులో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మూసీ వంతెన సమీపంలోకి రాగనే కారు అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపై నుంచి పల్టీలు కొడుతూ కిందకు పడిపోయింది. ఈ ఘటనలో కారు నడిపుతున్న వ్యక్తి ఉపేందర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. తీవ్ర గాయాలైన మృతుడి భార్య, కుమారులు, కుమార్తెను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శిల్పారామంలో దేశ భక్తి గీతాలు ఆలాపన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎస్‌కే కళాక్షేత్రం చైర్మన్ డా.ఎస్‌సీ వెంకట్ ఆచార్య శిష్య బృందంచే భక్తి గీతాలు, దేశభక్తి గీతాలను ఆలపించారు. భక్తి సంగీతంలో అన్నమాచార్య, రామదాసు, త్యాగరాజ కృతులు ఆలపించి మెప్పించారు. రిషి, కీబోర్డు ప్లేచేయగా రాజు తబలా వాయించారు. కళాకారులు పరిణిక, షాగున్, తన్వీ, నిరంజని, ఇందిరా, నాగమణి, విరాట్, మేధా, హిమాన్వి, రాఘవేంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంలో కోళ్ల వ్యర్థాలు, పురుగులు

మూడు రోజులుగా మల్లారెడ్డి కళాశాల విద్యార్థుల ధర్నా


మల్లారెడ్డి యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నా

మేడ్చల్‌రూరల్: మూడు రోజులుగా మల్లారెడ్డి కళాశాల విద్యార్థుల ధర్నా కొనసాగుతుంది. నాసిరకం ఆహారం పెడుతూ విద్యార్థుల ప్రాణాలతో మల్లారెడ్డి కళాశాల యాజమాన్యం చెలగాటం ఆడుతోందని ఎన్ఎస్‌యూఐ రాఘవేంద్రరెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి యూనివర్సిటీలోని గర్ల్స్ హాస్టల్‌లో నాసిరకం ఆహారం పెడుతున్నారని విద్యార్థులు ధర్నా చేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు మాట్లాడుతూ.. అన్నంలో కోళ్ల వ్యర్థాలు, అన్నంలో పురుగులు వస్తున్నాయని మూడు రోజులుగా ధర్నా చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వైఖరికి నిరసనగా గేటు ఎదుట ఎన్ఎస్‌యూఐ నాయకులు ధర్నా నిర్వహించగా, పోలీసులు విద్యా సంస్థల చైర్మన్ మహేందర్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడి సోమవారం వరకు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

నైపుణ్యం ఉంటేనే ఉన్నత స్థానాలకు..


టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమంలో అతిథులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాలెంట్ అక్విషియన్ హియరింగ్ మేనేజర్ వినయ్ శ్రీకాంత్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం స్పెక్ ఫెస్ట్ 2కె24 పేరుతో టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని, కళాశాలల్లో ఉన్నప్పుడే నైపుణ్యాలను పెంపొందించుకొని పరిశ్రమల్లో స్థానం సొంతం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపల్ డా.శ్రీలత, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు డా.ప్రసన్నకుమార్, దిలీప్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తుల స్వీకరణ


ప్రజాపాలన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని వార్డులో శనివారం నిర్వహించారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా 16వ వార్డులో రూ.500లకు వంట గ్యాస్ కోసం, 200 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లబ్ధిదారుల ఎంపిక కోసం 10వ వార్డులో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళతో కలిసి ప్రజా పాలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవేందర్‌ముదిరాజ్, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హబ్సిగూడ: పల్లవి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ నాయకులు మల్క కొమరయ్య ఆధ్వర్యంలో శనివారం హబ్సిగూడ డివిజన్ కామాక్షిపురం పోచమ్మ గుడి వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి పల్లవి ఫౌండేషన్ చైర్మన్, బీజేపీ నాయకులు మల్క కొమరయ్య, హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్, రామంతాపూర్ కార్పొరేటర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. అనంతరం పలువురికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


కామాక్షిపురంలో వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తూ..

నరేష్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

మల్లాపూర్: దుర్గానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నిమ్మగళ్ల నరేష్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. నరేష్ కుటుంబాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారి కుటుంబ సభ్యులకు రూ.50 వేలను అందజేశారు.